సాక్షి చిత్తూరు

శుక్రవారం, 26, మే, 2023



శేషునిపై ఇంద్రవరదుని వైభవం

యాదమరి ఇంద్ర వరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం సూర్య, శేషవాహన సేవలు వైభవంగా నిర్వహించారు. - 8లో



పిల్లలతో ఆటలొద్దు

ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల ఫిట్‌నెస్‌ను రవాణా శాఖాధికారులు పరీక్షిస్తున్నారు. నిబంధనలు పాటించని బస్సులను వెనక్కు పంపిస్తున్నారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	38	27
తిరుపతి	39	27
తిరుమల	35	24
గూడూరు	42	30
నగరి	40	28

వికృత రాజకీయం

'దళితులుగా ఎవ్వరైనా పుట్టాలనుకుంటారా' ఈ మాట అన్నది ఎవ్వరో కాదు..! 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, పార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే రాజకీయ కురువృద్ధుడు నారా చంద్ర బాబునాయుడు. అసెంబ్లీ సాక్షిగా దళితులను కించపరిచేలా వ్యవహరించి విమర్శల పాలయ్యారు. తర్వాత రాష్ట్ర రాజధాని అమరావతిలో పెత్తందార్లకకు కొమ్ముకాస్తూ దళిత, గిరిజన సామాజిక వర్గాలు ఉండకుండా చీకటి జీవోలు సృష్టించి అభాసుపాలయ్యారు. ఇప్పుడు ఇదే కోవలో దళిత ఎమ్మెల్యేలు, మంత్రులను అంటరానివారిగా ముద్రవేయాలని తమ పార్టీ నాయకత్వాన్ని రెచ్చగొడుతున్నారు. అంతేగాక సభ్యసమాజం తలదించుకునేలా దళిత ఎమ్మెల్యే తిరిగి వచ్చిన గ్రామాన్ని పసుపునీళ్లతో శుభ్రం చేయాలని, పాలతో అభిషేకాలు చేయాలని ఆదేశాలు జారీచేసి అమలు చేయిస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



టీడీపీ నేతల హెచ్చరికలతో ఇళ్లకు తాళాలు వేసిన పేటఅగ్రహారం గ్రామస్తులు

- దళితులను కించపరిచేలా టీడీపీ దుర్మార్గపు చేష్టలు
- ఆ సామాజికవర్గ ప్రజాప్రతినిధులే టార్గెట్
- గ్రామాల పర్యటన అనంతరం పసుపునీళ్లతో శుభ్రం చేస్తున్న తమ్ముళ్లు
- కంప్యూటర్ యుగంలోనూ అంటరానితనమా?
- జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో అరాచకం

సాక్షి, తిరుపతి: దళితులన్నా, దళిత జాతి అన్నా టీడీపీకి పట్టీటట్టు లేదు. దళితుల ఓట్లతో గద్దెనెక్కి 14 ఏళ్లు ముఖ్యమంత్రి పీఠం అధిరోహించిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అసెంబ్లీ సాక్షిగా 'దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా' అంటూ అవహేళన చేసిన విషయం తెల్సిందే. అలాగే రాష్ట్ర రాజధానిలో పెత్తందారులు, అగ్రకులస్తులే ఉండాలంటూ గిరగీసుకున్నారు. దీనిపై కోర్టులు మొట్టికాయలు వేయడంతో వెనక్కి తగ్గారు. ఇప్పుడు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుండడంతో తీవ్ర నైరాశ్యంలో పడిపోయారు. తమకు ఇక భవిష్యత్ ఉండదనే ఉద్దేశంతో ఆ పార్టీ నేతలను రెచ్చగొడుతున్నారు. దళిత ఎమ్మెల్యేలు, మంత్రులనే టార్గెట్ చేస్తూ వారి పర్యటనలకు అడగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారు. గ్రామాల్లోకి వచ్చిన నేతలకు ఎవ్వరూ స్వాగతం పలకరాదని హుకుం జారీ చేస్తున్నారు. తమ సామాజికవర్గం వారు ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లాలంటూ ఆదేశాలిస్తున్నారు. అలా వెళ్లని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అంతటితో ఆగక కొందరు అగ్రశ్రేణి నేతలు, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌లను రంగంలోకి దింపుతున్నారు. ఆయా గ్రామాల్లో ముందస్తు సమావేశాలు ఏర్పాటు చేసి తమ సామాజిక వర్గంతోపాటు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఒకవేళ దళిత మంత్రులు, ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటిస్తే వెంటనే అడ్డుకోవాలని సూచిస్తున్నారు.

దళితులంటే మలినమా?

స్వాతంత్ర భారతంలో దళితజాతి ఉద్ధరణకు సామాజిక వేత్తలు కంకణబద్ధులయ్యారు. అంటరానితనం రూపుమాపడానికి అహర్నిశలు శ్రమించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వల్లభాయ్‌పటేల్‌లాంటి మహానుభావులు దళితులు, నిమ్నజాతీయుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారు. ఇప్పటికీ వారి అడుగుజాడల్లో నడవాలని నేతలు సూచిస్తుంటారు. కానీ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కులాలను కించపరుస్తూ, దళితులను అంటరాని వారిగా ముద్రవేయాలని తహతహలాడుతున్నారు. ఈ కోవలోనే జీడీనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు తమ అధినేత అడుగుజాడల్లో నడిచారు. పూతలపట్టు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంఎస్ బాబు బుధవారం పేట అగ్రహారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసి గ్రామంలో ఎవరూ ఉండకూడదని స్థానిక టీడీపీ నాయకులు ప్రజలను భయాందోళనకు గురిచేసి తాళాలు వేయించారు. ఎమ్మెల్యే ప్రజలను కలవకుండా చేయాలని పంచాయతీలోని 5 గ్రామాల్లో ప్రజలంతా తాళాలు వేసుకుని పోవాలని టీడీపీ నాయకులు హుకుం జారీ చేశారు. తాళాలు వేసుకుని వెళ్లకుంటే అంతు చూస్తామని భయపెట్టారు. ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించి వెళ్లాక వీధులన్నీ పసుపు నీళ్లతో శుభ్రం చేయించారు.

ఆదేశాలు పాటిస్తూ.. అరాచకాలు సృష్టిస్తూ..

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నాయకుడు మనోహర్‌నాయుడు స్థానికులను బెదిరింపులకు గురిచేశారు. జీడీనెల్లూరు మండలం, తాటిమాకుల కండ్రిగ వాసులకు ఫోన్‌చేసి ఇళ్లకు తాళం వేసుకుని వెళ్లాలని హుకుం జారీచేశారు. 'ఉప ముఖ్యమంత్రి గురువారం వస్తున్నారు.. ఆయన వచ్చే సమయానికి గ్రామంలో ఎవ్వరూ ఉండడానికి వీల్లేదు' అని ఫోన్లు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే మండలం, పాచిగుంటలో బుధవారం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎవ్వరూ పాల్గొనడానికి వీల్లేదని, అసలు గ్రామంలో ఉండకుండా తాళాలు వేసుకుని వెళ్లిపోవాలని ఆదేశించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

నేను దళితుడనే కదా..మీ బాధ?



నేను దళితుడనే కదా మీ బాధ.. దళితులు ఎమ్మెల్యేలు కాకూడదా? ప్రజా సేవలో మేం ఉండకూడదా? గడపగడపకు వెళ్లొస్తే తెలుగుదేశం పార్టీ నాయకులు పసుపు నీళ్లతో మేం తిరిగి వచ్చిన వీధులన్నీ కడగడమేమిటి.? టీడీపీ ప్రభుత్వంలో ఏంచేశారు..? జనం అందుకే మిమిల్ని ఛీకొట్టారు. బుధవారం పేట అగ్రహారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తిచేసి వచ్చాక అక్కడి టీడీపీ నాయకులు మేం తిరిగిన రోడ్లన్నీ పసుపు నీళ్లతో కడగడం విడ్డూరంగా ఉంది. మేం గడపగడపకు వస్తోంది ఓట్లడగడానికి కాదు. సమస్యలను తెలుసుకోవడానికే మాత్రమే. దళితులంటేనే చంద్రబాబునాయుడుకు, ఆపార్టీ నాయకులకు తొలినుంచీ గిట్టదు. దళితులంటే చులకనగా చూసే తత్వం వారిది. టీడీపీ నాయకులు ఎన్ని మంత్రాలు.. తంత్రాలు చేసినా మళ్లీ రాబోయేది జగనన్న ప్రభుత్వమే. ఇకపై నీచ రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదు.

– ఎం.ఎస్.బాబు, పూతలపట్టు ఎమ్మెల్యే

దళిత ఎమ్మెల్యేలు గ్రామాలకు రాకూడదా?



దళిత ఎమ్మెల్యేలు గ్రామాలకు రాకూడదా? స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయినా టీడీపీ అధినేత చంద్రబాబుకు ఇంత కులపిచ్చా? బుధవారం గంగాధర నెల్లూరు మండలం పాచిగుంట గ్రామంలో మేం పర్యటిస్తే టీడీపీ జిల్లా నాయకుడు పాచిగుంట మనోహర్ నాయుడు కమ్మ సామాజికవర్గానికి చెందిన 22 కుటుంబాలను ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లమన్నారు. గురువారం తూగుండ్రం పంచాయతీ తాటిమాకులపల్లెలో పర్యటిస్తే ఆ గ్రామంలోని 10 కుటుంబాల వారిని ఇళ్లకు తాళాలు వేసుకుని వెళ్లమని మనోహర్‌నాయుడు ఆదేశించారు. దళిత ఎమ్మెల్యేలు గ్రామాలకు రాకుండా అడ్డుకోవాలని చంద్రబాబు నాయుడు, లోకేష్ ఆ పార్టీ నాయకులకు సలహాలు ఇస్తున్నారు. దళిత సోదరులారా మేల్కోండి. చంద్రబాబుకు దళితులంటే ఎందుకు అంత కక్ష? దళిత కుటుంబాల్లో పుట్టడం నేరమా..? రాష్ట్రానికి పట్టిన పెద్ద శని చంద్రబాబే. కులాలను రెచ్చగొట్టి లబ్ధిపొందిన నీచుడు ఆయన.

– నారాయణస్వామి, ఉప ముఖ్యమంత్రి

న్యూస్‌రీల్

జాతర ఆదాయం రూ.35లక్షలు



కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

కుప్పం: కుప్పంలో శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ. 35,36,976 ఆదాయం లభించింది. ఇందులో 81 గ్రాములు బంగారు, 194 గ్రాముల వెండి ఆభరణాలు ఉన్నాయి. వారం పాటు జరిగిన గంగ జాతరకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. మంగళవారం శిరస్సు ఊరేగింపు, బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనానికి భక్తులు పోటెత్తడంతో ఆదాయం భారీగా పెరిగింది. గత ఏడాది కంటే ఈసారి జాతర ఆదాయం రూ.4 లక్షలు పెరిగినట్లు దేవాదాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

వ్యవసాయ మీటర్లతో ఎలాంటి నష్టం లేదు

రైతులకు అవగాహన కల్పించాలి
అధికారులకు ట్రాన్స్‌కో ఎస్ఈ ఆదేశం



మాట్లాడుతున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: వ్యవసాయ మీటర్ల ఏర్పాటుతో రైతులకు నష్టం లేదని, క్షేత్రస్థాయిలో రైతుకు సిబ్బంది అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం చిత్తూరు అర్బన్ డివిజన్ ఈఈ కార్యాలయంలో అర్బన్, రూరల్, జిల్లాస్టోర్, ఎస్పీఎం అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ సర్వీసుల విద్యుత్‌కు ఎంత ఖర్చు అవుతుందో తెలుసుకునేందుకే ప్రభుత్వం మీటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై రైతులకు ఉన్న అపోహలను తొలగించాలని పేర్కొన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని కోతలు లేని సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు అయితే సకాలంలో సిద్ధం చేసి ఇవ్వాలని పేర్కొన్నారు. జగనన్న కాలనీలకు అవసరమైన విద్యుత్ సామగ్రి స్టోర్‌లో సిద్ధంగా ఉందని ఏఈలు వర్క్‌ఆర్డర్ పెట్టి తీసుకోవాలన్నారు. జిల్లాలో విద్యుత్ వాడకం అధికంగా ఉన్నా సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తున్నట్లు తెలిపారు. లైన్ ట్రిప్ అయినప్పుడు సకాలంలో స్పందించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈఈ పద్మనాభపిళ్లై, డీఈఈలు శేషాద్రి, జ్ఞానేశ్వర్, జయప్రకాష్, శ్రీనివాసమూర్తి, ఏఈఈలు, సబ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రేడ్ 2 హెచ్‌ఎం ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జోన్ 4 పరిధిలోని చిత్తూరు జిల్లాలో గవర్నమెంట్ మేనేజ్‌మెంట్‌లో ఖాళీగా ఉన్న గ్రేడ్ 2 హెచ్‌ఎం పోస్టుల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్ఆర్ కడప జిల్లా ఆర్జేడీ వెంకటకృష్ణారెడ్డి నుంచి డీఈవో కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. అర్హులైన వారు సీనియారిటీ జాబితా ప్రకారం వైఎస్ఆర్ కడప జిల్లాలోని ఆర్జేడీ కార్యాలయానికి హాజరు కావాలని ఉత్తర్వుల్లో సూచించారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



విత్తన కాయలను పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తన కాయల పంపిణీని ఎమ్మెల్యే వెంకటేగౌడతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్సిడీ విత్తన కాయలు పారదర్శకంగా పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విత్తనకాయలను సజావుగా అందించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. అర్హత కల్గిన ప్రతి రైతుకూ విత్తన కాయలు అందుతాయని తెలిపారు. పెట్టుబడి సాయం నుంచి గిట్టుబాటు ధర వరకు ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు డెయిరీలో అభివృద్ధి పనులు



మాట్లాడుతున్న అహ్మద్‌బాబు

తిరుపతి అర్బన్: జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా చిత్తూరు డెయిరీలో రూ.400 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు కో–ఆపరేటివ్ కమిషనర్ అహమ్మద్‌బాబు తెలిపారు. పాడి రైతుల నుంచి పాల సేకరణ పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లో జగనన్న పాలవెల్లువపై కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డితో కలిసి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రధానంగా నమోదైన పాడిరైతులందరికీ రుణ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లాలో 4,004 మంది పాడి రైతులు రిజిస్టర్ చేసుకుంటే 101 మందికి మాత్రమే రుణ సౌకర్యాన్ని కల్పించారన్నారు. పాలకు అధిక ధర చెల్లిస్తోంది ఒక్క అమూల్ మాత్రమేనని గుర్తుచేశారు. ఏఎంసీ, బీఎంసీల్లో రిపేర్లు వస్తే 7396211403కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వారంలోపు డీసీసీబీ పాడి రైతులకు రుణాలు అందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో జిల్లా కో–ఆపరేటివ్ అధికారి శ్రీనివాసులరెడ్డి, అమూల్ ప్రతినిధి నికుంజ్, డీఆర్డీఏ పీడీ జ్యోతి, పశుసంవర్ధక శాఖ, డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో గురువారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్టుమెంట్లు నిండాయి. బుధవారం అర్ధ రాత్రి వరకు 74,995 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 38,663 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీలో భక్తులు రూ.3.60 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ వారికి సకాలంలో, టిక్కెట్లు లేని వారికి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది.

నేడు ఎస్‌జీటీల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎస్‌జీటీ టీచర్ల ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్ శుక్రవారం జరుగుతుందని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్, గణితం, ఇతర సబ్జెక్టుల సీనియారిటీ జాబితాను డీవైఈఓ, ఎంఈఓలకు పంపినట్లు వెల్లడించారు. డీఈఓ కార్యాలయంలో కౌన్సిలింగ్ జరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నియోజకవర్గ స్థాయిలో సదస్సులు నిర్వహించాలని తహసీల్దార్లను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించడం కోసం సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం పరిధిలో నిర్వహించే ఈ సదస్సులో రెవెన్యూ సమస్యలను మాత్రమే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. తహసీల్దార్లు, వీఆర్వోలు, రెవెన్యూ టీమ్‌లు పాల్గొంటాయని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జేసీ వివరించారు.

జవాబుదారీతనంతో పనిచేయాలి

- జగనన్నకు చెబుదాంపై అవగాహన కల్పించాలి
- శుక్ర, శనివారాల్లో వలంటీర్ల ఇంటింటి పర్యటన
- పలు శాఖల సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : 'జగనన్నకు చెబుదాం (1902)'కు వచ్చే ప్రజల ఫిర్యాదులను అధికారులు జవాబుదారీతనంతో పరిష్కరించాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో కలెక్టర్ వరుస సమీక్షలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, వలంటీర్లపై ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో వలంటీర్లు తమకు కేటాయించిన ఇళ్లకు వెళ్లి ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని తెలిపారు.

అటవీ భూముల వివరాలు తెలపండి

గ్రామాల్లో రీ సర్వే చేసేటప్పుడు అటవీ భూములకు సంబంధించిన వివరాలు ఉంటే ఆశాఖ ఎఫ్ఆర్‌వోలకు తెలపాలని కలెక్టర్ ఆదేశించారు. అటవీశాఖ, రెవెన్యూ శాఖలతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బంగారుపాళ్యం, సోమల, గుడిపల్లె, పెద్దపంజాణి మండలాలలో రెవెన్యూ, అటవీ భూములకు సంబంధించి రీ సర్వే చేసేటప్పుడు ఎఫ్ఆర్‌వోలకు సమాచారం ఇచ్చి జాయింట్ సర్వే చేయాలని తెలిపారు. అటవీ ప్రాంతంలో ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల కోసం ఎంతమంది గిరిజనులు దరఖాస్తులు చేసుకున్నారన్న వివరాలను అందజేయాలన్నారు.

జిల్లా సరిహద్దులో 123 ఏనుగులు

జిల్లా అటవీశాఖ అధికారి చైతన్య మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి సుమారు 123 ఏనుగులు వచ్చి పలమనేరు, కుప్పం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నాయని తెలిపారు. ఏనుగుల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతోందని, అటవీ ప్రాంతంలో విద్యుత్ వల్ల ఏనుగులు చనిపోతున్నాయన్నారు. ఏనుగులు వచ్చే ప్రాంతాలను ముందుగానే గుర్తించి విద్యుత్ సరఫరా నిలిపివేయాలని ఆశాఖ అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతంలో ఉన్న విద్యుత్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన వారికి అటవీ శాఖ ద్వారా హెక్టార్‌కు రూ.పదివేలు, ఎకరాకు రూ.6వేలు చొప్పున నష్టపరిహారం అందజేస్తున్నామని తెలిపారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకరరెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చివరి మజిలీ బాధలు ఇక చెల్లు

ఆప్తులను పోగొట్టుకున్న కుటుంబాల విషాదం వర్ణనాతీతం. ఆత్మబంధువు చివరి మజిలీకి ఆరడుల శ్మశాన స్థలం కూడా లేకుంటే ఆ కన్నీటి వ్యథకు మాటలు చాలవు. అంతిమ సంస్కారాలు ఏ కాలువలు ఒడ్డునో.. ఏ రోడ్డు పక్కనో సాగిస్తే ఆ కుటుంబాలు కాదు.. చూసిన వారికి సైతం కన్నీటి ధారలు ఆగవు. జిల్లాలో చాలా దళిత వాడల్లో శ్మశానాలు లేవు. కొన్ని చోట్ల ఉన్నా బడా కబ్జా కోరల్లో చిక్కుకుని ఉన్నాయి. అణగారిన ప్రజల అభ్యున్నతే ఆశయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దళితవాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. భూ కేటాయింపులు చేయాలని జీవో చేయడంతో అధికారులు పకడ్బందీ కసరత్తు చేస్తున్నారు.

- దళితుల ఆత్మ గౌరవం కాపాడడమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పం
- దళిత వాడల్లో శ్మశాన వాటికలు
- గ్రామాల్లో భూమి కేటాయింపునకు చర్యలు
- జిల్లాలో 225 గ్రామాల్లో 125.86 ఎకరాల భూమి గుర్తింపు
- దశాబ్దాల కల నెరవేరిందంటున్న దళితులు
- నాడు బడుగుల బాధలు పట్టని టీడీపీ ప్రభుత్వం



కార్వేటినగరం బండ్రేవు కాలనీలో శ్మశానం కోసం కేటాయించిన స్థలం

జిల్లాలో శ్మశానాలకు గుర్తించిన భూములు (ఎకరాల్లో)

రెవెన్యూ డివిజన్	దళిత గ్రామాలు	అవసరమైన స్థలం	గుర్తించిన భూమి
చిత్తూరు	152	85.52	85.92
నగరి	15	10.60	10.60
పలమనేరు	34	17.19	17.19
కుప్పం	24	12.15	12.15
మొత్తం	225	125.86	125.86

సాక్షి, చిత్తూరు: జిల్లా వ్యాప్తంగా శ్మశాన స్థలాలు లేని గ్రామాల్లో స్థలాల కేటాయింపునకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం దళితుల శ్మశాన సమస్యను అసలు పట్టించుకోలేదు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేశాననే పదేపదే ఢంకా మోగించుకునే జిల్లాకు చెందిన చంద్రబాబు దళితుల సమస్యలు ఏనాడూ పట్టించుకోలేదు. దళితులు రోడ్డెక్కినా, ధర్నాలు చేసినా కనికరం చూపలేదు.పైగా ఆ ప్రభుత్వం అండదండలతో కొందరు పచ్చనేతలే శ్మశాన స్థలాలను సైతం ఆక్రమించుకున్న ఘటనలు ఉండడం ఆ ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం.

దళితుల అభ్యున్నతే ధ్యేయం

నేటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దళితుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తోంది. జిల్లాలోని 31 మండలాల్లో శ్మశాన వాటికలకు భూ కేటాయింపులు చేసింది. చిత్తూరు, నగరి, పలమనేరు, కుప్పం రెవెన్యూ డివిజన్‌ల వారీగా అధికారులు శ్మశాన వాటికలకు ప్రభుత్వ భూమిని గుర్తించారు. తదుపరి చర్యలను అధికారులు పకడ్బందీగా చేపడుతున్నారు. శ్మశానాలకు స్థలాలను కేటాయించడంతో పాటు మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించారు.


అప్పట్లోనే జీఓ ఇచ్చిన వైఎస్సార్

పేదలన్నా, దళితులన్నా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఎనలేని ప్రేమ. సంక్షేమ పథకాలతో వారిని ఆదుకోవాలని పరితపించిన మహానేతాయన. శ్మశాన సమస్యలపై 15 ఏళ్ల కిందటే 2008,అక్టోబర్ 25 నాడు జీవోఎంఎస్ నం.1235 విడుదల చేశారు.అప్పటి ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా శ్మశానాల సమస్య పరిష్కారం కోసం పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారీగా జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో, గ్రామాల్లో తహసీల్దార్లు, పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు బాధ్యత తీసుకునేలా ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉంటే శ్మశానాలకు కేటాయించాలి. లేనిపక్షంలో ప్రైవేటు భూములు సేకరించి భూములు ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఆ ఆదేశాలు వారి హయాంలో పక్కాగా అమలయ్యాయి. కానీ, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు గాలిగొదిలేశాయి. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు.

తండ్రిబాటలో మానవత్వం చాటిన జగనన్న

తండ్రి వారసత్వ లక్షణాలు పుణికిపుచ్చుకున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి కూడా వైఎస్సార్ తరహాలోనే దళితుల శ్మశాన సమస్యలపై మానవత్వం చాటారు. దళితుల హాయిగా జీవించేలా సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా చివరి మజిలీ అంత్యక్రియలు కూడా గౌరవంగా సాగేలా శ్మశాన స్థలాలు కేటాయించారు. మౌలిక సదుపాయాలు కల్పనకు ఆదేశాలిచ్చారు.

30 ఏళ్లుగా ఇబ్బంది పడ్డాం



మా గ్రామానికి శ్మశానం లేక మూడు దశాబ్దాలుగా చాలా ఇబ్బంది పడ్డాం. మృతదేహాలను కుశస్థలి నది ఒడ్డున పూడ్చేవాళ్లం. గత ప్రభుత్వంలో చాలాసార్లు శ్మశానం కోసం అర్జీ పెట్టుకొన్నాం. ఎవ్వరు పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక శ్మశాన సమస్య తీరింది. దళితవాడ శివారుల్లోనే మాకు స్థలం కేటాయించి శ్మశానం ఏర్పాటు చేయడం మరచిపోలేని సాయం.

– సెల్వం, కేవీశ్రీరామపురం, విజయపురం మండలం

గతంలో రోడ్లెక్కాం



దశాబ్దాల కాలం నుంచి శ్మశాన వాటిక కావాలని ధర్నాలు చేశాం. శవాలు జాతీయ రహదారిపై పెట్టి నిరసనలు చేశాం. టీడీపీ ప్రభుత్వంలో అనేక సార్లు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు చేశాం. అయినా ఫలితం శూన్యం. మృత దేహాలు కాలువ గట్లపై, రోడ్డు పక్కన దహనం చేశాం. అయినా అప్పటి ప్రభుత్వం పట్టించు కోలేదు. జగనన్న సీఎం అయ్యాక శ్మశాన స్థలం కేటాయించారు. మౌలిక వసతులు కల్పించారు. సమస్య తీరింది. జగనన్న రుణం తీర్చలేనిది.


– నాగరాజు, బండ్రేవు కాలనీ, కార్వేటినగరం

ఊరు పుట్టినప్పటి నుంచి శ్మశానం లేదు.



మా గ్రామంలో 120 కుటుంబాల యానాదులున్నాం. ఇప్పటి వరకు ఎవరైనా చస్తే శ్మశానం లేదు. పొలాల వద్ద, పొలాలు లేనివారు అడవి పక్కన మృతదేహాలను ఖననం చేసే వాళ్లం. ఈ ప్రభుత్వంలో శ్మశానానికి మా గ్రామం సమీపంలోని ప్రభుత్వ పోరంబోకు భూమి 80 సెంట్లు ఇచ్చి దానికి ట్రెంచ్ కొట్టించారు. ఇకపై ఏ ఇబ్బంది లేకుండా శ్మశాన వాటికకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించుకోవచ్చు. –రామచంద్ర, జగమర్ల, పలమనేరు మండలం

అన్ని మండలాల్లో స్థలాల గుర్తింపు



ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ భూమిని గుర్తించాం. చాలా చోట్ల స్థలాలు కేటాయించాం. మిగిలిన గ్రామాలకు కూడా స్థలాలను కేటాయించడమే కాకుండా శ్మశానాల్లో వసతులు కల్పిస్తాం. క్షేత్రస్థాయిలో పకడ్బందీగా ప్రక్రియ జరిగేలా పర్యవేక్షణ చేస్తున్నాం.

– శ్రీనివాసులు, జాయింట్‌కలెక్టర్

మంచి క్రీడాకారులుగా రాణించండి

తిరుపతి కల్చరల్ : వేసవి ఉచిత క్రీడాశిక్షణా శిబిరాల్లో క్రీడల్లోని మెలకువలను అందిపుచ్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలని స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ కోచ్ సయ్యద్, తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ పిలుపునిచ్చారు. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత క్రీడాశిక్షణా శిబిరాలను గురువారం వారు సందర్శించారు. క్రీడాకారులకు ఉచితంగా బాల్స్‌ను అందజేశారు.

పిల్లలతో ఆటలొద్దు..

ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల సామర్థ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఏదైనా సంఘటన జరిగినప్పుడు హడావుడి చేయకుండా ముందస్తు చర్యలు ప్రారంభించింది. జూన్ నెల నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానుండడంతో రవాణాశాఖాధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాలకు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బస్సులను ఫిట్‌నెస్ కోసం తీసుకొస్తున్నాయి. ఎంవీఐ స్వయంగా వాహనాన్ని నడిపి పనితీరు పరీక్షిస్తున్నారు.

- త్వరలో పాఠశాలల పునః ప్రారంభం
- డీటీసీలో ప్రైవేటు బడి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్ష
- క్యూ కడుతున్న వాహనాలు
- కండిషన్ లేకుంటే బండి వెనక్కు పంపడమే
- నిర్వహణలో నిర్లక్ష్యం వద్దంటున్న అధికారులు

చిత్తూరు రూరల్: ప్రైవేటు విద్యా సంస్థల బస్సులు రోడ్డు మీదకు రావాలంటే తప్పనిసరిగా రవాణా శాఖ జారీ చేసిన సామర్థ్య ధ్రువీకరణ పత్రం ఉండాలి. జిల్లాలో విద్యా సంస్థల బస్సులు 840 దాకా ఉన్నాయి. పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో రవాణాశాఖ అధికారులు ప్రైవేటు విద్యా సంస్థల బస్సుల కండీషన్‌పై దృష్టిసారించారు. వాహనాలు నగరంలోని డీటీసీ కార్యాలయానికి క్యూ కడుతున్నాయి. రోజుకు 30 నుంచి 40 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షకు వస్తున్నాయి. అధికారులు నిశితంగా తనిఖీలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 250 బస్సులకు పరీక్షలు చేశారు. ఇందులోని 80 బస్సులకు లోపాలు గుర్తించి వెనక్కి పంపించారు. నిబంధనలు పాటించని యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నారు.

తనిఖీల్లో బయటపడుతున్న బండారం

ఫిటెనెస్ కోసం వస్తున్న బస్సులను అధికారులు పరిశీలిస్తుంటే వాటి బండారం బయటపడుతోంది. విద్యార్థులు బస్సులోకి ఎక్కే మెట్లు సరైన ఎత్తులో ఉండడం లేదు

- అత్యవసర ద్వారం వెంటనే తెరచుకోవడం లేదు
- టైర్లు సరిగా ఉండడం లేదు. హ్యాండ్ బ్రేక్ పని చేయడం లేదు
- సీట్లు కూడా సక్రమమంగా ఉండడం లేదు
- స్టీరింగ్ సరిగా తిరగడం లేదు. బ్రేకులు వేసినప్పుడు పెద్దగా శబ్దం వస్తోంది
- డ్రైవర్లకు ఐదేళ్ల అనుభవం ఉండడం లేదు


బస్సు ఫిట్‌నెస్ పరీక్షిస్తున్న ఎంవీఐ

నిబంధనలు కచ్చితంగా పాటించాలి



ప్రైవేటు స్కూల్ బస్సుల విషయంలో నిబంధనలకు కచ్చితంగా పాటించాలి. పిల్లల విషయంలో ప్రైవేటు స్కూల్ యాజమాన్యం అలసత్వం వహించ కూడదు. బండి రోడ్డు ఎక్కాలంటే ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలి. నిబంధనలు అతిక్రమించి బండి రొడెక్కితే సీజ్ చేస్తాం. కేసులు కూడా పెడుతాం. బడి తెరిచే లోపు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి.

- నిరంజన్‌రెడ్డి, డీటీసీ, చిత్తూరు

యాజమాన్యాలు చేయాల్సినవి

- వాహన చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్ను –చెల్లింపు రశీదు, పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్‌తో పాటు డ్రైవర్లకు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలి
- డ్రైవర్ ఫొటోను బస్సులో ఏర్పాటు చేయాలి
- అద్దాలకు గ్రిల్స్ అమర్చి ఉండాలి
- డ్రైవర్‌కు 60 ఏళ్లు మించరాదు
- ప్రతి బస్సులో అటెండర్ ఉండాలి. రూట్ మ్యాప్ తప్పనిసరి
- ప్రతి నెల స్కూల్ ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ తప్పనిసరిగా బస్సులను తనిఖీ చేయాలి
- పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదు
- బస్సులకు తప్పనిసరిగా పసుపు రంగు వేయాలి
- పాఠశాల పేరు, సెల్‌ఫోన్ నంబర్, పూర్తి చిరునామా ఎడమవైపు కనిపించేలా ఉండాలి.
- డ్రైవర్లు మూడు నెలలకోసారి బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలి.

ఇవి తప్పనిసరి

- ఎఫ్సీ పొందేటప్పుడు డ్రైవర్ వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్ దరఖాస్తులో నమోదు చేయాలి
- డ్రైవర్‌కు 50 ఏళ్ల లోపు వయస్సు, ఐదేళ్లు వాహనం నడిపిన అనుభవం ఉండాలి
- ఒక బస్సు డ్రైవర్ వివరాలు మరోదానికి ఇచ్చే అవకాశం ఉండదు. ఒకవేళ అతను వేరే పాఠశాలకు మారినా సంబంధిత వివరాలను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో చేయాలి
- అన్ని అర్హతలున్న వారినే యాజమాన్యాలు తీసుకోవాలి
- 15 ఏళ్లు దాటిన బడి బస్సులను తుక్కు కింద పరిగణించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలాంటి వాహనాలకు అనుమతి ఉండదు
- కిటికీకి స్క్రీన్, వైపర్స్, లైటింగ్ పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలించాలి. ఏమైనా లోపాలు గుర్తిస్తే రికార్డులో నమోదు చేసి వెంటనే మరమ్మతులు చేయించాలి
- ప్రథమ చికిత్స కిట్, అత్యవసరమైన మందులు బస్సులో ఉంచాలి
- పాఠశాల, కళాశాల ఆవరణలోనే బస్సులు ఎక్కాలి, దిగాలి



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,350
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,600
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

స్కూటరిస్టుకూ తీవ్ర గాయాలు


మృతి చెందిన ఎర్రమందడి

శ్రీరంగరాజపురం: మండలంలో చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై కొత్తరోడ్డు వద్ద గురువారం రాత్రి ద్విచక్రవాహనం ఢీ కొని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మెదవాడ గ్రామానికి చెందిన గంగయ్య కుమారుడు లోకేష్ ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. కొత్తరోడ్డు వద్ద రోడ్డు దాటుతున్న గొల్లఇండ్లకు చెందిన ఎర్రమందడి(75)ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. లోకేష్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు.

అతని పరిస్థితి కూడా విషమంగా ఉంది. సమాచార మందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అతివేగం, తాగి వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

కుప్పంలో ఘర్షణ: ఇద్దరి పరిస్థితి విషమం

- 11 మందికి గాయాలు
- 22మందిపై కేసు నమోదు

కుప్పం: కుప్పం కొత్తపేటలో జాతర సందర్భంగా ఇరువర్గాల మధ్య చెలరేగిన చిన్నపాటి వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గురువారం ఉదయం ఇరు వర్గాలు దాడులకు దిగిడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 11 మంది స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు కథనం.. పట్టణంలోని కొత్త పేటలో మంగళవారం రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపులో మునుస్వామి, వాసు వర్గాలకు మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ విషయమై బుధవారం రెండు వర్గాలు దుర్భాషలాడుకున్నారు. ఈ వాదోపవాదాలు తీవ్రమయ్యాయి. గురువారం ఉదయం కొత్తపేటలో రెండు వర్గాలు దాడులకు దిగారు. గాయపడిన వారిని స్థానిక వంద పడకల ఆస్పత్రికి తరలించినా అక్కడ కూడా మరో సారి ఘర్షణ పడ్డారు. వీరిలో వాసులు, షణ్ముగం పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరు ఆస్పత్రికి తరలించారు. ఇరు వర్గాలకు చెందిన 22 మందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీధర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శివయ్య కోరారు. ఈమేరకు ఆ సంఘ నాయకులు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దు చేయడం వల్ల ఎంతో ఉంది ఉద్యోగులకు మేలు చేసినట్లు అవుతుందని చెప్పారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో పలు శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

యువకుడిపై అట్రాసిటీ కేసు

చిల్లకూరు: మండల కేంద్రంలోని శంకర గిరిజన కాలనీకి చెందిన ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించిన యువకునిపై గురువారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం.. మండలంలోని శంకర గిరిజన కాలనీకి చెందిన ఓ యువతి, ఓడూరు సమీపంలోని రొయ్యల పరిశ్రమలో పనిచేసేది. పున్నపువారిపాళెం గ్రామానికి చెందిన వాసు కూడా అదే పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అక్కడ అతడితో యువతికి ఇబ్బందిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమెను పనికి వెళ్లకుండా నిలిపి వేశారు. అయితే ఆ యువకుడు ఆమె ఇంటి వద్దకు వచ్చి యువతితో అసభ్యంగా ప్రవర్తించడంతో తల్లిదండ్రులు యువకునిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు విచారణ జరిపి, అతనిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

తిరుపతిలో గాలీవాన బీభత్సం


కరకంబాడి రోడ్డులో కూలిన దుకాణాలు


కొర్లగుంట సర్కిల్ వద్ద ..


గోవింద నగర్‌లో కూలిన వృక్షం


పోస్టాఫీసు వద్ద ..

తిరుపతి తుడా: తిరుపతిలో భారీ వర్షం నమోదైంది. గురువారం సాయంత్రం సుమారు గంటకు పైగా గాలీవాన బీభత్సం సృష్టించింది. పెనుగాలుల ధాటికి జనజీవనం అస్తవ్యస్తమైంది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని తొలగించారు. అలాగే మధురానగర్, రైల్వే కాలనీ, కొర్లకుంట, చంద్రశేఖరరెడ్డి కాలనీ, అశోక్‌నగర్, కోరమేనుగుంట, ఎస్టీవీ నగర్, గాంధీపురం తదితర లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు పెద్ద ఎత్తున చేరింది. కరకంబాడి రోడ్డు, హరేరామ హరేకృష్ణ రోడ్, ఎస్వీ యూనివర్సిటీ రోడ్, రుయా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.

శేషుడిపై ఇంద్రవరదుని అభయం


శేష వాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

యాదమరి: మండల కేంద్రంలోని త్రివేణి సంఘమంలో వెలసిన ప్రముఖ శ్రీఇంద్రవరదరాజస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దేవదేవేరులు శేష వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువజామున మూలవర్లుకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శ్రీదేవి,భూదేవి సమేత స్వామివారి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు రాత్రి శేష వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపులు నయనానందకరంగా సాగాయి. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

నేడు గరుడవాహనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గరుడ వాహన సేవ జరుగనుంది. ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు ఉంటాయి.

కర్ణాటక మద్యం సీజ్.. ఇద్దరు అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ పోలీసులు

చిత్తూరు అర్బన్: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని చిత్తూరు రూరల్ ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) పోలీసులు గురువారం అరెస్టు చేశారు. నగరంలోని మిట్టూరులో ఉన్న ఎస్ఈబీ కార్యాలయంలో నిందితుల అరెస్టు చూపి, సీఐ చంద్రశేఖర్‌నాయుడు వివరాలు వెల్లడించారు. బంగారుపాళ్యం మండలం మొగిలి క్రాస్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఇద్దరు ద్విచక్రవాహనంపై తెల్లటి సంచిని తీసుకొస్తుండగా ఆపి, తనిఖీ చేయగా 77 మద్యం ప్యాకెట్లు దొరికాయన్నారు. నిందితులు పి.షణ్ముగం (32), డి.ఈశ్వరయ్య (42)ను అరెస్టు చేసి, కర్ణాటక మద్యంతో పాటు ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మోహన్‌బాబు, సిబ్బంది కృష్ణయ్య, సుబ్రమణ్యం, కిరణ్, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి పాల్గొన్నారు.